నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | HYDERABAD

ఎగ్జిబిషన్‌లో జైళ్ల శాఖ ఏర్పాటు చేసిన చర్లపల్లి కేంద్ర కారాగారం 'మై నేషన్ స్టాల్'కు ఆలిండియా ఇండస్ట్రియల్ స్టేట్ గవర్నమెంట్ స్టాల్స్ విభాగంలో మొదటి బహుమతి లభించింది. ఈ మేరకు మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి నుంచి జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు అవార్డును అందుకున్నారు. కాగా, ఎగ్జిబిషన్‌ను మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. -చర్లపల్లి/ అబిడ్స్

శానిటేషన్ విధానాలు భేష్

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): లక్నో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శానిటేషన్ బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేసేందుకు నగరానికి వచ్చారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు, శానిటేషన్‌ను పరిశీలించారు. ఇందులోభాగంగానే సోమవారం ఈ లక్నో బృందం మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది. శానిటేషన్, సీ అండ్ డీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలుపై మేయర్ నుంచి వారు వివరాలు అడిగి తెలుసుకున్నది. ఇక్కడి శానిటేషన్ విధానాలు బాగున్నాయని కితాబిచ్చింది. ఈ బృందంలో లక్నో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సుష్మ, కార్పొరేటర్లు (ఎగ్జిక్యూటివ్ మెంబర్స్) సుశీల్‌కుమార్, సౌరవ్ సింగ్, శైలేంద్ర వర్మ, ముఖే సింగ్, సురేంద్ర, వాల్మీకి, కమల్ సక్సేనా, హరిశ్చంద్ర, కన్నా జియా, ఉమేశ్ సాన్వాల్, ఎస్ఈ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పాతబస్తీ మెట్రో.. పట్టాలెక్కేదెప్పుడో?

డీపీఆర్, నిర్మాణ అనుమతులున్నా.. ముందుకు కదలని ప్రాజెక్టు పనులు

తాత్సారం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కి అన్నట్లు తయారైంది పాత బస్తీ మెట్రో పరిస్థితి. మెట్రో రెండో దశ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందిస్తున్నది. 7 మార్గాల్లో 70 కి.మీల మేర నిర్మించే రూట్లలో పాతబస్తీకి చెందిన 5.5 కి.మీ మార్గం సైతం ఉంది. అయితే మెట్రో మొదటి దశలో ప్రతిపాదించిన మొత్తం 72 కి.మీ మార్గానికి సంబంధించిన డీపీఆర్‌ను 2010-2011లోనే అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించింది. నిర్మాణ అనుమతులు సైతం ఉన్నాయి. మళ్లీ కొత్తగా పాతబస్తీకి సంబంధించిన ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న 5.5 కి.మీ మార్గానికి డీపీఆర్ అవసరం లేకపోయినా, దాన్ని సైతం రెండో దశలో చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఒకసారి డీపీఆర్ పూర్తయి, నిర్మాణ అనుమతులు సైతం వచ్చిన మెట్రో మార్గానికి మళ్లీ డీపీఆర్ అవసరం లేదు. ఎల్ అండ్ టీతో ఉన్న ఒప్పందంలో భాగంగా దాన్ని వెంటనే నిర్మాణం చేపట్టేందుకు అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

పాతబస్తీ 5.5 కి.మీ మెట్రో మార్గం ఇలా...

మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా కారిడార్-2 (జేబీఎస్-ఫలక్‌నుమా) మార్గంలో 5.5 కి.మీ మార్గాన్ని స్పష్టంగా ఖరారు చేశారు. ఈ రూట్‌లో 5 స్టేషన్లను సాలార్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా ప్రాంతాల్లో నిర్మించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు.

చొరవ తీసుకుంటే..

పాతబస్తీకి మెట్రో అన్నది ఎన్నో ఏండ్లుగా ఉన్న డిమాండు. మాకు మెట్రో కావాలంటూ పాతబస్తీ వాసులు పదే పదే కోరినా.. వాయిదాలు పడుతోందే తప్ప..అడుగు ముందుకు పడటం లేదు. రెండో దశ మెట్రోతో సంబంధం లేకుండా పాతబస్తీ మెట్రో మార్గాన్ని 5.5 కి.మీ మేర నిర్మించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటే వెంటనే ప్రారంభించేందుకు అవకాశం ఉంది. అయినా ఆ విషయాన్ని పట్టించుకోకుండా రెండో దశలో చేర్చి కొత్తగా డీపీఆర్‌ను రూపొందిస్తున్నామని చెప్పడం పట్ల పాతబస్తీ వాసులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

103 కట్టడాల గుర్తింపు...

పాతబస్తీలో నిర్మించే మెట్రో మార్గంలో మొత్తం 103 కట్టడాలు మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. మొత్తం మార్గంలో 4 చోట్ల తప్ప మిగిలిన అన్ని మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను పరిరక్షిస్తూ మెట్రో మార్గం నిర్మాణం ఉంటుందన్నారు. ఈ మార్గంలో రోడ్డు వెడల్పు 80 అడుగులకు పరిమితం చేసి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. విస్తరణలో ప్రభావితమయ్యే సుమారు 1000 ఆస్తుల వ్యక్తిగత స్కెచ్‌ల తయారీ ప్రారంభించామని, ఒక నెల రోజుల్లో భూ సేకరణ నోటీసులు జారీ చేస్తామని మెట్రో అధికారులు గతంలోనే ప్రకటించారు. అయినా వీటన్నింటినీ పక్కన పెట్టి..మళ్లీ ఈ మార్గాన్ని రెండో దశ మెట్రో ప్రాజెక్టులో చేర్చడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ముగ్గురు ఆర్డీవోలు బదిలీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ముగ్గురు రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ ..ప్రభుత్వం సోమవారం జీవోను జారీ చేసింది. హైదరాబాద్ యూఎల్‌సీలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకట ఉపేందర్ రెడ్డిని రాజేంద్రనగర్ ఆర్డీవోగా బదిలీ చేశారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న ఎల్.రమాదేవిని కీసర ఆర్డీవోగా, జహీరాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న కె.వెంకటరెడ్డిని శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మరో డిప్యూటీ కలెక్టర్ అయిన ఎస్.రాజేశ్‌కుమార్‌ను రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

చలో నల్గొండ

చరిత్రలో నిలిచిపోయేలా సభ: ఎమ్మెల్యే మాగంటి

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : కృష్ణా ప్రాజెక్టులను కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లాలో నిర్వహించే భారీ బహిరంగ సభకు గ్రేటర్ నుంచి భారీ ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే సభ నిర్వహణపై తెలంగాణ భవన్‌లో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నేతలతో సీఎం కేసీఆర్ ఇటీవల సమావేశం నిర్వహించి.. బహిరంగ సభకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే గ్రేటర్ వ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకున్నారు. 500 ఆర్టీసీ బస్సులతో పాటు భారీ ర్యాలీలతో కార్లలో నల్గొండకు వెళ్లేలా ప్లాన్ చేశారు. కృష్ణా జలాల హక్కులపై బీఆర్ఎస్ పోరాటం వల్లే కృష్ణా ప్రాజెక్టులు అప్పగించలేదని కాంగ్రెస్ తీర్మానం చేసిందని, ఇది కేసీఆర్ విజయమని హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. నల్గొండ సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివెళ్లి సభను విజయవంతం చేస్తామన్నారు.

మేడ్చల్ జిల్లా నుంచి పదివేల మంది..

మేడ్చల్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ)/బేగంపేట్: నల్గొండలో నేడు జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి భారీ సంఖ్యలో గులాబీ శ్రేణులు, రైతులు తరలివెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల నుంచి 10 వేల మంది తరలివెళ్లేలా సిద్ధమయ్యారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 2 వేల మంది తరలివెళ్లనున్నారు. నల్గొండ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల వాటా తేల్చకుండా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నల్గొండలో జరిగే సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న నీళ్ల పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలన్నారు. ఇప్పటికే రైతులందరూ నల్గొండ సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్నారు. నల్గొండ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కృష్ణ జలాల పరిరక్షణ, కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్ట్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ సభను నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రాజెక్ట్‌లను కేఆర్ఎంబీకి అప్పగిస్తే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని చెప్పారు. మంగళవారం ఉదయం 9 గంటలకు మారేడ్‌పల్లిలోని మున్సిపల్ మైదానానికి శ్రేణులు చేరుకోవాలని అక్కడి నుంచి ర్యాలీగా నల్గొండ సభకు బయలు దేరనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలతా, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లికార్జున్‌గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో పలు పనులను పరిశీలించారు.

పూడికతీతపై నీలినీడలు

సిటీబ్యూరో: వర్షాకాలంలో వరద ముంపు నివారణకు ఏటా వేసవిలో ముందస్తు నాలా పూడికతీత పనులను జీహెచ్ఎంసీ చేపడుతూ వస్తున్నది. అయితే ఈ ఏడాది పూడికతీత పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏటా మాదిరిగానే నాలా పూడికతీతకు దాదాపు రూ. 45 కోట్ల ఖర్చుతో రూ.884.15 కిలోమీటర్ల మేరలో పనులకు టెండర్లు పిలిచారు. అయితే ఇప్పటికే తొలి దఫా టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన రాలేదు. దీంతో రెండో సారి టెండర్లను పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



పేదలకు వరంగా టెలీ మెడిసిన్

సిటీబ్యూరో: కేసీఆర్ సర్కార్ ప్రవేశపెట్టిన టెలీమెడిసిన్ సేవలు పేద రోగులకు వరంలా మారాయి. కరోనాకు ముందు ప్రారంభించిన ఈ సేవలు కొవిడ్ కష్టకాలంలో రోగులకు ఎంతో ఉపయోగపడ్డాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న అన్ని బస్తీ దవాఖానల నుంచి ఆన్‌లైన్ విధానంలో ఈ టెలీమెడిసిన్ సేవలు అందిస్తున్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే, పేట్లబుర్జ్, సుల్తాన్‌బజార్ ప్రసూతి దవాఖానల ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉన్నాయి. టెలీమెడిసిన్ ద్వారా ఆర్థో, డెర్మటాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ, ఆంకాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూరాలజీ తదితర సేవలను అందిస్తున్నారు. కేసీఆర్ సర్కారు తీసుకొచ్చిన టెలీ మెడిసిన్ సేవలతో వందలాది మంది రోగులు ఇంటి దగ్గర లోని బస్తీ దవాఖానల నుంచే నిమ్స్, ఉస్మానియా, గాంధీ వైద్యసేవలు పొందుతున్నారు. అంతే కాకుండా దీర్ఘకాలిక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించగలుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

సిటీ ఠాణాల్లో జర్నలిస్టులకు నో ఎంట్రీ

సిటీబ్యూరో: పోలీస్‌స్టేషన్‌లోకి విలేకర్లకు నో ఎంట్రీ.. ఇది ప్రజాపాలన అంటూ.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొన్ని పీఎస్‌లలో అమలవుతున్న నిబంధన. ఒకవైపు డయల్ 100కు ఫోన్ చేసినా.. పట్టించుకోని పోలీసులు.. మరోవైపు ఠాణాల్లోకి పాత్రికేయులు రావొద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో ఈ నిబంధన అమలవుతున్నది. డీసీపీయే స్వయంగా జర్నలిస్టులను రావద్దని చెప్పారని, ఆ ఆదేశాలను అమలు చేస్తున్నామంటూ.. కొందరు పేర్కొంటున్నారు. మధురానగర్ పీఎస్‌లోకి రిపోర్టర్లను అనుమతించమని, తమకు ఉన్న తాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలని, మా ఇన్‌స్పెక్టర్ అమలు చేయమన్నారంటూ.. ఓ కానిస్టేబుల్ చెప్పి తిరిగి పంపిస్తున్నారు.

6.5 కోట్ల యూనిట్లు

ఫిబ్రవరిలోనే రికార్డు స్థాయిలో..

ఎండలతో పెరిగిన విద్యుత్ వినియోగం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): మండుతున్న ఎండలతో గ్రేటర్‌లో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగింది. ఫిబ్రవరి మొదటి వారం నుంచే రికార్డు స్థాయిలో ఎండల తీవ్రత ఉండడంతో అదే స్థాయిలో కరెంటు వినియోగం పెరుగుతున్నది. ఈనెల 8న 65 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగిందని అధికారులు తెలిపారు. అదే సమయంలో గతేడాది ఫిబ్రవరిలో 55 మిలియన్ యూనిట్లకు మించలేదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే వినియోగం రికార్డు స్థాయిలో ఉంటోందని, ఇలానే ఉంటే 70 మిలియన్ యూనిట్లు దాటే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. గతేడాది ఏప్రిల్-మే నెలల్లో అత్యధికంగా 80 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైతే ఈసారి మాత్రం మార్చి, ఏప్రిల్ నెలల్లో దాన్ని అధిగమించేలా ఉందని పేర్కొంటున్నారు. విద్యుత్ వినియోగం గణనీయంగా పెరగడానికి ఎండల తీవ్రతకు తోడు కొత్తగా కనెక్షన్లు పెరగడం కూడా మరో కారణమన్నారు. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో కొత్త ఇండ్ల నిర్మాణాలతో పాటు భారీ హౌసింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలు పెరుగుతుండడంతో విద్యుత్ డిమాండు వేసవి సీజన్‌లో అత్యధికంగా నమోదవుతోందని తెలిపారు. డిమాండుకు అనుగుణంగానే సరఫరా చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ క్షేత్ర స్థాయిలో వేసవి కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

హెల్మెట్ ధరించడం వల్లే.. ప్రాణాలతో ఉన్నా

ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో నటుడు సాయి ధరమ్‌తేజ్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12: తాను రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డానని, హెల్మెట్ ధరించడం వల్లే ప్రాణాలతో ఉన్నానని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించకుండా తమ ఫోన్లలో వీడియోలు తీయడం చాలా బాధాకరమని, అలాంటి సమయాల్లో వ్యక్తి ప్రాణాలు కాపాడాలని.. వీడియోలు తీస్తూ అత్యంత కీలకమైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కాలేజీలో నగర పోలీసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, హీరో సాయిధరమ్ తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి ధరమ్‌తేజ్ మాట్లాడుతూ..వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ సీపీగా తరుణ్‌జోషి

సిటీబ్యూరో: ట్రై కమిషనరేట్లలో పలువురు ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మల్టీజోన్-2 ఐజీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో మల్టీజోన్-1 ఐజీగా కొనసాగుతున్న తరుణ్ జోషిని నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా జోయల్ డేవిస్, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీగా గిరిధర్, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సాధన రష్మి పెరుమల్‌ను నియమించారు.